# దిక్కుతోచని యముడు

పులిగడ్డ లక్ష్మి

స్వర్గం మూసేశారు. ఒక్క కేసుకూడా రావటం లేదని. నరకంలో మాత్రం జనం కిటకిటలాడుతున్నారు. అప్పటికే గవర్నమెంటువారి సిటీబస్‌లోలా కెపాసిటీకన్నా ఎక్కువ మందినే కూరారు. అక్కడికీ యమధర్మరాజు అర్జంటు కేసులు తప్పితే తీసుకరావద్దని భటులకు గట్టివార్నింగ్ ఇచ్చాడు. అలా తీసుకొచ్చిన వాళ్ళని భూలోకానికి పంపిస్తాననే సరికి యమ భటులు హడలిపోయి భూలోకంలో ఎంత పెద్ద ప్రమాదాలు జరిగినా, ఎన్నిలక్షల ఆస్తి నష్టమయినా మనుషుల ప్రాణాలుమాత్రం దగ్గరుండి జాగ్రత్తగా కాపాడుతున్నారు. అర్జంటు కేసులకి కూడా స్థలం చూపించలేక యముడు తికమక పడుతూ. ఆ కేసులకి కారణభూతులయిన కల్తీదారులనీ, అతివృష్టి అనావృష్టులను ఛడామడా తిడుతున్నాడు. అక్కడికీ వరుణుడికి ఇంటర్ ఆఫీస్ మెమో ఒకటిచ్చాడు. అతివృష్టినీ, అనావృష్టినీ తగ్గించమని. ఎంత కాలం చూసినా రిప్లయి రాకపోవడంతో బ్రహ్మదేవుడికి ఒక అప్లికేషన్ పెట్టాడు. సృష్టిని కొంతకాలం ఆపమనీ లేకపోతే చాలా ఘోరాలు జరుగుతాయనీ.

బ్రహ్మదేవుడు అసలే భూలోకంలో గవర్నమెంటువారు కుటుంబనియంత్రణపట్ల చూపే శ్రద్ధచూసి విసుక్కుంటున్నాడు. వున్నవాళ్ళకి కూడుబెట్టటం చేతకాక నేనిచ్చిన అనేక వనరులను సరిగా ఉపయోగించుకోలేక వాళ్ళచచ్చు మేధస్సును ఉపయోగించి ఉన్న వాటిని కలుషితం చేసుకుంటున్నారని అక్కడికీ ప్రముఖులందరికీ కలలో స్వయంగా కనబడి చెప్పాడట ఈ ప్రయత్నాలు మానమని. కాని అంతా అయ్యో! బ్రహ్మగారు స్వయంగా వచ్చారే అని కనీసం నమస్కారమైనా చేయకుండా, పై వాళ్ళ ఆర్డర్స్ మే మీ విషయంలో మీకే సహాయం చేయలేమని నిర్మొహమాటంగా చెప్పి వెంటనే ముసుగుతన్ని పడుకున్నారట. పోనీ ఆ పై వాళ్ళకే చెప్దామనుకుంటే వాళ్ళు కలుసుకనే తీరికకూడా లేనంత బిజీగా ఉన్నారట. అయినా వీళ్ళె యింత మర్యాద చేశారు. వాళ్ళింకెంత చేస్తారోనని, ప్రజలలో తమయందు భయభక్తులు బొత్తిగా తగ్గిపోయాయని దిగులుపడుతున్న సమయంలో చేరిందట మన యమధర్మరాజు గారి పిటీషన్. ఇపుడేమి చూడను పొమ్మని విసుక్కున్నాడట చేసేదిలేక.

బ్రహ్మదేవుడికి పంపిన అప్లికేషన్‌కి కూడా సమాధానం రాకపోవటంతో యముడికి చిర్రెత్తుకొచ్చింది. నాకింకోళ్ళు సహాయంచేసే దేమిటి? చతుర్విధోపాయాలలో ఏదో ఒక ఉపాయంతో నా సమస్య నేనే పరిష్కరించుకుంటానని హూంకరించాడు. నరకంలో వున్న వాళ్ళలో కొందరికి ప్రమోషన్ ఇచ్చి భూలోకంపంపాలనుకున్నాడు. ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. పోనీ కొందరినైనా ఏ చిన్న కారణం దొరికినా గట్టి రికమండేషన్‌తో స్వర్గానికి తోసేసి స్వర్గం తెరిపిస్తే కొంత రద్దీ తగ్గుతుందనుకున్నాడు. ఆలోచన వచ్చిందే తడువుగా ఒక పదిరోజులు చిత్రగుప్తుడితో సహా రాత్రింబగళ్ళు శ్రమపడి అన్ని కేసులూ వివరంగా చదివాడు లాభంలేక పోయింది. ఒకటీ అరా దొరికినయిగానీ. ఈ ఒకళ్ళిద్దరి కోసం రికమండ్‌చేస్తే తన ప్రపోజల్ వీగి పోతుందనుకున్నాడు. అందులోనూ పెట్టిన అప్లికేషన్‌కే దిక్కూదివాణం లేదయ్యే.

ఇంక ఇదికాదుపని అనిచిత్రగుప్తునితో బాగా ఆలోచించినమీదట, నరకంలోని పాపులందరితో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. భూలోకానికి వెళ్ళేవాళ్ళని లక్షాధికారుల ఇళ్ళల్లో పుట్టిస్తానన్నాడు. మంత్రి పదవు లిప్పిస్తానన్నాడు. కానీ జీవులంతా ఏకమయి కన్నుమూసి తెరిచేసరికి పదిమంది మంత్రులు మారుతున్నారు. లక్షాధికారులు భిక్షాధికారు లవుతున్నారు, మేం వెళ్ళం పొమ్మన్నారు. అతిలోక సుందరుల రూపం ఇస్తానని ఆశ పెట్టాడు. మామూలు ఆడవాళ్ళనే పదిమంది ముందు రోడ్డుమీద నానా గోలా చేస్తుంటే పట్టించుకునే దిక్కులేదు ఆ సంఘంలో. ఇంక ఈ సౌందర్యంతో మేమవస్థలు పడలేంస్వామీ అన్నారు. అయినా భూలోకంలో పెద్ద పెద్దవాళ్ళంతా ప్రపంచాన్ని స్వర్గంగా మారుస్తామని, కడుపు నిండా తిండి, వంటినిండా బట్ట దొరుకుతుందనీ, ఇలా ఎన్నెన్నో ఆశలు పెడితే నమ్మినమ్మి విసుగొచ్చింది స్వర్గం కాదుగదా' కనీసం నరకంలో ఉన్న ప్రశాంతత కూడా లేదక్కడ. ఇంక ఏ ఆశలకూ లొంగం పొమ్మన్నారు.

వీళ్ళు చాలా ఆరితేరిన ఘటాలు, ఇలా లొంగరనుకొని ఎవరూ లేకుండా చూసి ఒక్కొక్కళ్ళని పిలిచి బాబ్బాబు అని కాళ్ళా గడ్డాలు పట్టుకున్నంత పనిచేశాడు. లాభంలేకపోయింది. యముడికి చిర్రెత్తుకొచ్చింది. నా అంతటివాడ్ని ఇలా బతిమాలుతుంటే ఇంత విఱ్ఱవీగుతారా అని ఇంక భయపెట్టటం ప్రారంభించాడు. సలసలకాగే నూనెలో వేయిస్తాననీ, అగ్ని స్తంభాలకు అంటగడతాననీ బెదిరించాడు. ఊహు, లాభంలేకపోయింది. పైగా నమ్రతగా యమధర్మరాజుకు ఇలా విన్నవించారు.

"అయ్యా, యముడు గారూ, తమరు మమ్మల్ని నూనెలోనే వేయిస్తారో, అగ్ని స్తంభాలకే కడతారో లేకపోతే నీరుగడ్డకట్టుకునే చల్లగాలిలో వదులుతారో అంతా మీ ఇష్టం, మేమేమీ అభ్యంతర పెట్టం కానీ మమ్మల్ని మాత్రం తిరిగి భూమిమీద పుట్టమనవద్దు. అక్కడి వాతావరణం ఏ క్షణంలో ఎలా వుంటుందో మీ బ్రహ్మగారికే అంతుపట్టటంలేదు. ఆ వాతావరణం తట్టుకోవటం ముందు మీరు చెప్పే బాధలు ఒక లెక్కలోనివికావు. ఇంకామామీద కోపం తీరకపోతే విషవాయువులు వదలండి కావాలంటే కాలనాగులతో కాటు వేయించండి. ఒకసారి ఎటూ చద్దాం కనక చావంటే భయంలేదు. బాధంటారా? భూలోకంలో కల్తీ మందులు, కల్తీ వస్తువులు తిని క్రమక్రమేణా క్షీణిస్తూ, ఏ క్షణంలో చస్తామో తెలియక, చస్తామనే భయంతో క్షణమొక యుగంగా గడపటం ముందు ఇదో లెక్కా. అదీగాక మాకింకో భరోసా ఉందండోయ్. ఇక్కడ పెరిగిపోయే జీవుల్ని అదుపులో పెట్టటానికి మీ భృత్యులెటూ సరిపోరు. మీ కాలిగ్సందరూ ఎవరి గోలల్లో వాళ్ళుండటంవల్ల వాళ్ళ నుంచి మీకేసహాయమూ రాదు. అందుకని ఇవాళ కాకపోతే రేపయినామాలో కొందర్ని మీ భృత్యులుగా తీసుకోక తప్పదు. అందేకొంతకాలానికైనా మాకునమ్మకంగా ఉద్యోగాలు దొరుకుతాయి భూలోకంలో ఏముందండీ? ఎన్ని గవర్నమెంటులు మారినా, ఎన్ని సంస్థలు పెరిగినా, నిరుద్యోగులకు మాత్రం దిక్కు లేదు అదీకాక మీ రేమనుకోకపోతే ఓ చిన్న సలహా! భూలోకంలో వస్తువుల ధరలు నక్షత్రాల నంటుతున్నాయంటున్నారు కదా. రేపో మాపో నరకందాకా రావచ్చు. అప్పుడు దాన్నే ఇంకా డెవలప్ చేస్తే ఎటూ ధరలు మనదాకా వస్తాయి గనక; వచ్చిన తర్వాత మనల్ని దాటిపోలేవు కనుక, మనకి వస్తువులన్నీ చౌకగా దొరుకుతాయి.

అయ్యా, ఒక సలహా ఎటూ విన్నారు కనుక రెండోదికూడా వినండి. అంతగా అయితే మాకో దోవ చూపించే దాకా వచ్చిన అభ్యర్థులని క్యూలో నుంచో పెట్టండి. మా అందరికీ పొద్దున్న లేస్తే కాఫీకి పాలకోసం దగ్గర నుంచీ, చివరకి వినోదం

కోనం చూసే సినిమాదాకా క్యూలోనుంచోవటం అలవాటే. అందుకని ఏమీ అనుకోము. పైగా అక్కడలాగా ఇక్కడ వృత్త చెయ్యి చూపించరు గనుక ఓపిగ్గా వైట్ చేస్తాము. ఇంకా కావాలంటే ఆ క్యూని కంట్రోల్ చెయ్యటానికి మాలో కొందరిని నియమించండి.

అంటూ సలహా లిచ్చారు. మేము భూలోకానికి పోమని మూకవుమ్మడిగా నినాదాలిచ్చారు. ఏలుండే సమ్మెకూడా చేయటానికి సిద్ధంగా ఉన్నారు.

ఈ గోలతో పాపం యముడికి దిక్కు తోచటం లేదు,

---

*With best compliments :*

**Distributors for Rallifans in Andhra Pradesh**

# Messers: BELDE ENTERPRISES

**141, Durga Bhavan, Rashtrapathi Road,**

**SECUNDERABAD.**